

తొలగని 'చికెన్' భయం

- తినాలంటే జంకుతున్న ప్రజలు
- అవగాహన చర్యలు చేపట్టిన పౌల్ట్రీ వ్యాపారులు
- గత వారం కంటే కాస్త మెరుగైన పరిస్థితి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బర్డ్‌ఫ్లూ కేసులు ప్రస్తుతం నమోదు కాకపోయినా ప్రజల్లో చికెన్ భయం తొలగడం లేదు. చికెన్ తినాలంటే జంకుతున్న పరిస్థితి కనిపిస్తోంది. బర్డ్ ఫ్లూ భయంతో గత ఆదివారం చికెన్ వ్యాపారాలు పూర్తిగా పడిపోగా ఈ వారం పరిస్థితి కాస్త మెరుగైంది. పౌల్ట్రీ యజమానులు, వ్యాపారులు చికెన్, ఎగ్ మేళాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు...

బర్డ్ ఫ్లూ భయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో ఇంకా తొలగలేదు. బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాలతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో చికెన్, ఎగ్ వ్యాపారాలు పడిపోయియి. దాదాపుగా చికెన్ విక్రయాలు 20 శాతానికి పడిపోయినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యి వరకూ చికెన్ సెంటర్లు ఉన్నాయి. కర్నూలు నగరంలోనే 200కు పైగాఉన్నాయి. సగటున రోజుకు ఒక్కో చికెన్ సెంటరు ద్వారా 200 నుంచి 300 కిలోల వరకు అమ్మకాలు జరుగుతాయి. ఈ ప్రకారం ఉమ్మడి జిల్లా మొత్తం మీద దాదాపు 2 లక్షల కిలోల నుంచి 3 లక్షల కిలోల వరకు చికెన్ అమ్మకాలు ఉంటాయి. బర్డ్ ఫ్లూ వెలుగు చూసిన తర్వాత గత ఆదివారం చికెన్ అమ్మకాలు 10 శాతం మాత్రమే జరగగా, ఈ ఆదివారం 20 శాతం విక్రయాలు జరిగాయి. వ్యాపారాలు ఊపందుకోకపోవడంతో పౌల్ట్రీ రైతులు, వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. చికెన్, గుడ్లను 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినవచ్చని వైద్యులు, అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ వినియోగదారుల్లో బర్డ్‌ఫ్లూ భయం పోవడం లేదు. కర్నూలులో చికెన్ కిలో ధర ఫిబ్రవరి ఆరంభంలో రూ.260 నుంచి రూ.280 ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచి రూ.200కు వచ్చింది. ఇతర ప్రాంతాల్లో రూ.150 నుంచి 180కి తగ్గించారు. అయినా వినియోగదారులు ఆసక్తి చూపడంలేదు. ఈ క్రమంలో మాంసం, చేపలకు డిమాండ్ పెరిగింది. గతంలో మటన్ కిలో ధర రూ.800 నుంచి 840 ఉండగా తాజాగా రూ.900 నుంచి రూ.వెయ్యికి పెంచేశారు. అయినా మటన్ అమ్మకాలు మూడు రెట్లు పెరిగాయి. చేపల అమ్మకాలు నాలుగైదు రెట్లు పెరిగాయి. ఆకాశమెత్తు ఎదిగిన కోళ్ల వ్యాపారం బర్డ్ ఫ్లూ దెబ్బతో దారుణంగా పడిపోవడంతో కోళ్ల పరిశ్రమలో పేరు గాంచిన పౌల్ట్రీ యజమానులు చికెన్, కోడి గుడ్లు తింటే ప్రాణాలకు ప్రమాదం ఉండదని, ప్రజల్లో ఆ భయాన్ని పోగొట్టేందుకు తెలంగాణ అంతటా చికెన్ మేళాలు ఏర్పాటు చేసి ప్రజలను మళ్లీ చికెన్‌కు దగ్గర చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చికెన్, ఎగ్ మేళాలు నిర్వహించి చికెన్, ఎగ్ తినుబండారాలను ఉచితంగా పంపిణీ చేశారు. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ దూరంగా ఉంటున్న వారిని మళ్లీ దగ్గరకు చేసి కోళ్ల పరిశ్రమను గాడిలో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో పక్క పశు సంవర్ధక శాఖ అధికారులు కూడా కోడి మాంసం తింటే ప్రమాదమేమీ లేదని చెపుతున్నారు. అధికారులు ఎంతగా చెపుతున్నప్పటికీ జనాలు నమ్మడానికి వెనకడుగు వేస్తున్నారు. ఎంతకీ చికెన్ వ్యాపారాల గ్రాఫ్ పెరగడం లేదు. దీంతో కోళ్ల కంపెనీలే ముందుకొచ్చి తమ ప్రయత్నాలను ఈ తీరుగా మొదలెడుతున్నాయి. జనం కూడా అదే రేంజ్‌లో స్పందిస్తుండటంతో వ్యాపారులు ఒకింత సంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.




కర్నూలులో చికెన్ మేళాలో అవగాహన కల్పిస్తున్న పౌల్ట్రీ యజమానులు

కర్ణాటక జల చౌర్యాన్ని అరికడతాం : ఎంపీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తుంగభద్ర దిగువ కాలువ నుంచి కర్నూలుకు వస్తున్న నీటిని కర్ణాటకాలోని ఎర్రగుడి రిజర్వాయర్ కు మళ్లించడం పై ఎంపి బస్తిపాటి నాగరాజు స్పందించారు. జల చౌర్యం పై టిబి బోర్డు అధికారులతో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా కర్నూలుకు వచ్చే నీటిని పైపుల ద్వారా ఎలా మళ్లిస్తారన్నారు. బళ్లారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర చెబితే అక్కడి అధికారులు నీటిని పైపుల ద్వారా దోపిడీ చేయడం ఏంటని ప్రశ్నించారు. నీటిని మళ్లించడం ద్వారా తమకు వేసవిలో తాగు నీటి సమస్య వస్తుందని, ఆ సమస్యను ఎవరు తీరుస్తారన్నారు. నీటి చౌర్యాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నీటి మళ్లింపు నిలిపివేశారన్నారు. ఇక మరో సారి తమ నీటిని దోపిడీ చేయాలని భావిస్తే అక్కడి అధికారులు, నాయకులు తీవ్ర పరిణామాలు ఎదరుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటి మళ్లింపుపై కర్నూలు వాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

టిబి ముక్త్ పంచాయితీలే లక్ష్యం

- క్షయ నివారణకు అందరూ కృషి చేయాలి
- ప్రజాశక్తితో టిబి నివారణ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పంచాయతీలను టిబి ముక్త్ పంచాయితీలే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా టిబి నివారణ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్ తెలిపారు. క్షయ వ్యాధి(టిబి)ని అదుపు చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..



క్షయ అంటే ఏమిటి?

అధికారి: క్షయ మైకో బాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా కలిగే తీవ్రమైన అంటు వ్యాధి. స్త్రీ, పురుషులకు ఏ వయసులోనైనా రావచ్చును. శరీరంలోనిగోళ్ళు, వెంట్రుకలు తప్ప ఏ అవయానికైనా రావచ్చును. ఎక్కువగా ఊపిరితిత్తులకు సంక్రమిస్తుంది. దీనిని శ్వాసకోశ క్షయ అంటారు.

క్షయ ఏవిధంగా వ్యాపిస్తుంది?

అధికారి: క్షయ రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్షయ క్రిములు గాలిలోనికి సన్నని తుంపర్లుగా వెళ్తాయి. ఈ తుంపర్లను ఆరోగ్యవంతులు పీల్చినపుడు, వారికి వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉంది.

క్షయ లక్షణాలు ఏమిటి?

అధికారి: రెండు వారములకు మించి ఎడతెరిపి లేని దగ్గు రావటం, సాయంత్రం పూట జ్వరం రావటం, ఛాతిలో నొప్పి రావటం, ఆకలి తగ్గటం, బరువు తగ్గటం, గళ్ళలో రక్తం పడటం టిబి లక్షణాలు.

క్షయవ్యాధికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: పుట్టిన వెంటనే పసిబిడ్డలకు బిపిజి సూదిమందు ఇప్పించాలి. దగ్గు వచ్చినపుడు నోటికి గుడ్డ అడ్డు పెట్టుకోవాలి. క్షయ రోగి ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదు. క్షయ రోగికి సంబంధించిన కుటుంబ సభ్యులు గళ్ళ పరీక్ష చేయించుకోవాలి. మందులు సక్రమంగా చెప్పిన విధంగా క్రమంగా వాడాలి. వ్యాధి లక్షణాలు తగ్గినప్పటికీ వైద్యము, మందులు మధ్యలో ఆపరాదు. మందులు వాడే సమయంలో రియాక్షన్ లాంటివి వస్తే భయపడకుండా తప్పక డాక్టరును సంప్రదించాలి. డాక్టరు చెప్పినట్లు నడుచుకోవాలి.

రోగ నిర్ధారణ పరీక్షలు, నివారణ మందులు ఎక్కడెక్కడ లభిస్తాయి?

అధికారి: కర్నూలు జిల్లా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఆవరణలో క్షయ నివారణ కేంద్రము (కెపి.-36) ఉంది. నంద్యాల, ఆదోని, గవర్నమెంట్ హాస్పిటల్ ఆవరణలో టిబి హాస్పిటల్స్ ఉన్నాయి. నందికొట్కూరు, ఆత్మకూరు, కోయిలకుంట్లు గోనెగండ్ల, పత్తికొండ, అలూరు, వెలుగోడు, నంద్యాల గ్రామీణం, బనగానపల్లె, వెల్దుర్తి, ఎమ్మిగనూరు, ఆదోని గ్రామీణ, ఓర్వకల్లు, అళ్లగడ్డ, తదితర ప్రాంతాల్లో 18 టిబి యూనిట్లు ఉన్నాయి. 101 మైక్రోస్కోపిక్ సెంటర్స్ కూడా ఏర్పాటు చేశారు. ఈ 101 మైక్రోస్కోపిక్ సెంటర్లలో మరియు కర్నూలు నగరంలోని మెడికల్ కాలేజీలో, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి, ఆదోని ఏరియా ఆసుపత్రులలో ఆధునికమైన సీబీ నాట్ మిషన్ ద్వారా, 27 ఆర్‌టీపిసిఆర్ మిషన్ల ద్వారా నిర్ధారణ చేస్తారు. వ్యాధి నివారణకు రోగికి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గ్రామంలోని హెల్త్ మరియు వెల్‌నెస్ సెంటర్, క్షయ వ్యాధి చికిత్స సహాయక కేంద్రం, ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రతి గ్రామములోని క్షయ రోగులకు ప్రత్యక్ష పర్యవేక్షణా స్వల్పకాలిక చికిత్సా విధానములో ఉచితంగా 95 (డాట్స్) మందులను రోజు వారీ మ్రింగించెదరు.

టిబి ముక్త్ పంచాయితీలను ఎలా నిర్ధారిస్తారు?

అధికారి: గ్రామ జనాభాలో 30 శాతం వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. పరీక్ష ఫలితాలలో ఒక శాతం కంటే తక్కువగా టిబి కేసులు ఉన్నట్లయితే ఆ గ్రామాన్ని టిబి ముక్త్ పంచాయతీగా నిర్ధారిస్తారు. 2023లో 16 గ్రామాలను టిబి ముక్త్ పంచాయతీలుగా ప్రకటించారు.



చెత్త సేకరణ క్లాప్ ఆటోల సీజ్

- రెడ్డి ఏజెన్సీ ఫైనాన్స్ కట్టనందుకు 91లో 78 ఆటోల సీజ్
- ఖాళీ ప్లాట్లలో చెత్త కుప్పలు - దోమలు, దుర్వాసనతో కంపు కొడుతున్న నగరం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దే దిశగా వైసిపి ప్రభుత్వంలో ఇంటింటి చెత్త సేకరణ చేసేందుకు క్లాబ్ ఆటోలు 91 రెడ్డి ఏజెన్సీ ద్వారా కర్నూలుకు వచ్చాయి. 91 క్లాప్ ఆటోల్లో ప్రస్తుతం 78 ఆటోలను సీజ్ చేశారు. ప్రస్తుతం 14 ఆటోలు మాత్రమే ఉన్నాయి. దీంతో నగరంలో చెత్త సేకరణ ఆగిపోయి ఎటు చూసినా నగరం చెత్తమయమై దుర్వాసన వెదజల్లుతుంది. ఖాళీ ప్లాట్లల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. దోమల కాటుతో విష జ్వరాలు ప్రబలి ప్రజల ఆరోగ్యలపై ప్రభావం చూపుతుంది.

ఎందుకు సీజ్ చేశారు-కారకులెవరు?

రెడ్డి ఏజెన్సీ ఎస్‌బిఐ , టాటా ఫైనాన్స్ ద్వారా రుణం తీసుకొని క్లాప్ ఆటోలను కొన్నారు. ఇటు కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించకపోగా, అటు బ్యాంకులకు ఫైనాన్స్ చెల్లించకపోవడంతో విసిగి వేసారి రెడ్డి ఏజెన్సీకి మూడు పర్యాయాలు నోటీసులు పంపిన స్పందించకపోవడంతో సంబంధిత ఫైనాన్స్ వారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు వాహనాలను జప్తు చేసుకోవాలని ఆదేశించడంతో ఎస్‌బిఐ, టాటా ఫైనాన్స్ కంపెనీలు ఆటోలను సీజ్ చేశారు. క్లాప్ ఆటో డ్రైవర్లు సీజ్ చేసేందుకు వచ్చిన అధికారులతో గొడవ పడగా కోర్టు ఆదేశాలు ఉన్నాయి. అవసరమైతే మీపై కేసులు బుక్ చేస్తామని ఎస్‌బిఐ టాటా ఫైనాన్స్ వారు హెచ్చరించారు.

క్లాప్ ఆటోలను నడిపేందుకు వైసిపి నాయకుడు ఒక్కో డ్రైవర్ నుండి రూ.60 వేల నుండి రూ. రెండు లక్షల వరకు వసూలు చేసి విధుల్లో చేర్చుకున్నారు. విధుల్లో చేరినప్పుడు ఒక్కొక్కరికి నెలకు రూ.18,500 జీతం చెల్లించి పిఎఫ్, ఇఎస్ఐ కడతామన్నారు. 2023 ఫిబ్రవరి6న నగరపాలక సంస్థలో వారు చేరారు. ఉద్యోగ భద్రత ఉంటుందని పిఎఫ్,ఎస్ఐ కట్ చేస్తారని భావించి చేరిన వారికి రెడ్డి ఏజెన్సీ నిర్వాకం వల్ల నేడు క్లాప్ ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారు.

స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు

కర్నూలు నగరంలోని పాలక పక్ష ప్రతిపక్ష కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు పట్టించుకోకపోవడంతో క్లాప్ ఆటో డ్రైవర్ల జీవితాలు అగమ్య గోచరంగా మారాయి. వారికి చేరినప్పటి నుండి సక్రమంగా జీతాలు ఇవ్వకుండా కేవలం రూ.10000 నుండి రూ.12వేల వరకు జీతాలు మాత్రమే ఇస్తూ వచ్చారు. కొందరి ఖాతాల్లో పిఎఫ్, ఇఎస్ఐ ఖాతాల్లో కేవలం రూ.మూడు నుండి రూ.5000 వరకు మాత్రమే జమయ్యాయి. ఇంకా ఏడు నెలల జీతాలు బకాయి ఉన్నాయి. క్లాప్ ఆటో డ్రైవర్లు ఎటు తోచని స్థితిలో ఎమ్మెల్యేల వద్దకు అధికారుల వద్దకు తిరిగినా ఎవ్వరూ స్పందించలేదు. నెలలతరబడి ధర్నాలు, ఆందోళన చేసినా పట్టించుకోలేదు. ఏమి చేయలేమని రెడ్డి ఏజెన్సీ ద్వారా జీతాలు తీసుకోవాలని తమకు సంబంధం లేదని నగరపాలక సంస్థ అధికారులు చేతులెత్తేశారు.

వారిపై తొమ్మిది మంది సూపర్వైజర్లు ఒక మెకానిక్ కూడా పనిచేస్తూ ఉండేవారు. ప్రస్తుతం వారందరి పరిస్థితి ఉద్యోగంలో చేరిన సమయంలో కట్టిన డబ్బులుపోయి, జీతాలు రాక తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఆటోలు సీజ్ చేసినప్పటినుండి ఆటో డ్రైవర్లు తిండిలేక తల్లడిల్లి పోతున్నారు. క్లాప్ డ్రైవర్లు తమకు ఉపాధి చూపించండి, లేదా పెండింగ్ జీతాలు అయినా ఇవ్వండి అంటూ కోరుతున్నారు.



సీజ్ చేసిన క్లాప్ ఆటోలు

చెత్తను తోపుడుబండ్ల ద్వారా సేకరిస్తున్నాం



నగరంలో క్లాప్ ఆటోలను సీజ్ చేయడంతో నగరంలో చెత్త పేరుకుపోకుండా ఉండేలా గతంలో లాగా తోపుడుబండ్ల ద్వారా వీధుల్లోని చెత్తను సేకరిస్తున్నాం. దీంతో పని వేగం తగ్గింది. వీలైనంత తొందరగా చెత్తను తరలించేందుకు శ్రద్ధ తీసుకుంటున్నాం. క్లాప్ డ్రైవర్ల ఏడు నెలల బకాయి వేతనాలు స్టాండింగ్ కమిటీలో పెట్టి ఇచ్చేందుకు కృషి చేస్తాం.

- ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి.

ఉపాధి కల్పించి ఆదుకోవాలి



తాము క్లాప్ ఆటో డ్రైవర్లుగా చేరే సమయంలో కందేరిలో ఉండే ఒక వైసిపి లీడర్ కు రూ.60 నుండి రూ. రెండు లక్షల వరకు ముడుపులు చెల్లించుకున్నామని తెలిపారు. చేరినప్పటి నుండి రెడ్డి ఏజెన్సీ పిఎఫ్ ఖాతాల్లో మూడు నుండి ఐదు వేల వరకు మాత్రమే జమ చేశారు. సీజ్ చేసేందుకు వచ్చిన అధికారులకు అడ్డుపడితే కోర్టు ఆదేశాలు ఉన్నాయి మీపై కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

- షఫీ క్లాప్ ఆటో డ్రైవర్.

తక్కువ వేతనంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాం



2022 ఫిబ్రవరి 6న చేరిననాటి నుండి రూ.9000 నుండి రూ.12 వేల జీతం వరకు తీసుకుంటూ నగరాన్ని చెత్త లేని నగరంగా తీర్చిదిద్దడంలో తాము కషి చేశామని తమకు న్యాయం చేసి ఉపాధి చూపించాలని కోరారు. ఇచ్చే వేతనంలో కూడా వాహనం లేని సందర్భాల్లో డ్యూటీలో లేని రోజులకు వేతనం కట్ చేసేవారు. తమకు బకాయి వేతనాలు చెల్లించి వెంటనే పనిలోకి తీసుకోవాలని లేనిపక్షంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

- రాజేష్ క్లాప్ ఆటో డ్రైవర్.

బకాయి జీతాలు చెల్లించాలి



ఉపాధి లేదు, బకాయి వేతనాలు ఇవ్వకుండా క్లాప్ ఆటోలను సీజ్ చేయడంతో తాము రోడ్డున పడ్డామని తిండి గడవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని బకాయి వేతనాలు చెల్లించి తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. రెడ్డి ఏజెన్సీకి రూ.13 కోట్లు రావాల్సి ఉందని అందు ఫైనాన్స్ తొమ్మిది కోట్లు చెల్లించాల్సి ఉందని సమాచారం తెలిసింది. రెడ్డి ఏజెన్సీ చెల్లించాల్సిన రూ.13 కోట్లు చెల్లించాల్సిన బకాయి రాబట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

- రఘు శేఖర్ క్లాప్ఆటో డ్రైవర్.

అధిక వడ్డీ ఆశ చూపి రూ. 5 కోట్లతో పరారీ..?

- ఆందోళనలో బాధితులు

ప్రజాశక్తి - సి.బెళగల్

అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి రూ.కోట్లతో పరారయిన ఓ మోసగాడి ఉదంతం సి.బెళగల్ మండలంలో వెలుగుచూసింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోనీ కంభదహాల్ గ్రామానికి చెందిన బ్యాంకు మిత్రపేరుతో కెనరాబ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్‌గా మండలంలో ప్రజలకు, వ్యాపారులకు , రైతులకు పరిచయమయ్యారు. మండల కేంద్రంలో ఓ ప్రముఖ బ్యాంకును కేంద్ర బిందువుగా చేసుకొని రైతులకు రుణాలు ఇప్పించేవాడు. పంట మార్జిన్ రుణాలు చేయించడం, ఆయా బ్యాంకులలోని లావాదేవీలు పర్యవేక్షిస్తూ నగదును డ్రా చేయించడం వంటివి చేస్తుండే వాడు. ఇదే క్రమంలో అదనుగా భావించినప్పుడల్లా అధిక వడ్డీ యాప్‌లను చూస్తూ అతడి దగ్గరికి వచ్చి వెళ్లే వారికి ఆశ చూపి డిపాజిట్లు చేయించుకొని కొంతమందికి సక్రమంగా వడ్డీ చెల్లిస్తూ అడ్డదారిలో నమ్మకం చాటుకున్నారు. నాలుగేళ్ల కాలానికి వడ్డీ ఆశాపరుల సంఖ్య వందల్లోకి చేరింది. ఇక ఒకరి నగదు మరొకరికి వడ్డీగా ఇస్తూ. డిపాజిట్లు ఎంత పెడితే అంత వడ్డీ అంటూ నూటికి రూ 4 నుంచ రూ20 ఇలా అధిక వడ్డీలతో కోటీశ్వరులు అవడం కాయమంటూ నమ్మబలికాడు. మండలంలో ఇతని మాయలో పడి రూ.లక్ష నుండి రూ.ఐదు లక్షలు ఆపై పది నుండి ఇరవై రూ.30 లక్షల వరకు అప్పనంగా ముట్టజెప్పినట్లు ప్రచారం జరగుతోంది. చేతులేత్తేసే దురుద్దేశ్యంతో ఎలాంటి డిపాజిట్ బాండ్లు ఇవ్వకుండానే బాధితుల సమాచారం మేరకు రూ.ఐదు కోట్ల మేర తీసుకోని హుడాంచాయి.

మోసగాడి పరారితో బాధితుల్లో ఆందోళన

ఆ వ్యక్తి అలాంటి ఘనుడు కాదని అందరూ భావిస్తూ ఉండగా వారం రోజులైనా ఊరికి రాలేదు. ఇల్లు తెరువక పోవడం, చివరికి మండలంలో ఎక్కడా కనిపించక పోవడంతో బాధితులలో కలవరం నెలకొంది. అంతా మోసపోయాం...అంటూ బాధితులు ఒకరితో ఒకరు చెప్పుకొని గుండెలు బాదుకుంటున్నారు.

బాధితుల ఆత్మహత్యాయత్నం

ఇదే క్రమంలో కొందరు సామాన్యులు అధికవడ్డీ వస్తుందని బంధువుల దగ్గర అప్పులు తెచ్చి రూ.20 నుండి రూ.35 లక్షల వరకు ఆ ఘనుడికి ముట్టజెప్పారు. అందులో కంభదహాల్ కు చెందిన మూగ వ్యక్తి ఆ ఘనుడి మోసాన్ని తట్టుకోలేక కొడవలితో తలపై నరుకున్నాడు. ఇది గమనించిన కుటుంబీకులు ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించగా కోలుకున్న వారంలోపే ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం చికిత్స పొందుతూన్నాడు. సి. బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికి మూడు వారాలైంది..ఇక ఆ బాధితులకు న్యాయం జరిగేనా.. అన్న సందేహాలు మండలంలో చక్కర్లు కొడుతున్నాయి.

బాండ్లు ఉంటే కోర్టుకు వెళ్ళండి: ఎస్ఐ తిమ్మారెడ్డి

వడ్డీ వస్తుందని ఒకే వ్యక్తికీ రూ.లక్షలు ముట్టచెప్పి మోస పోతున్న బాధితులు బాండ్లు ఉంటే కోర్టుకు వెళ్ళండి.చట్టపరిధిలో చెయ్యాల్సిన న్యాయం చేస్తాం. ఇప్పటికే బాధితులు పోలీస్ స్టేషన్ కు వరుస కడుతున్నారు. పిర్యాదులను అందుకొని జనరల్ గా నమోదు చేసుకొంటున్నాం. మోసపూరితమైన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి.

చేయి బదులుగా ఇరవై ఒక్క లక్షలు ఇచ్చాము

ఓంకారం బాధితుడు కంభదహాల్

ఆ ఘనుడు పొలం మార్జిన్ లోను వస్తుందని శనివారం బ్యాంకు సెలవని వెంటనే చేయి బదులుగా నన్ను రూ.22 లక్షలు అడిగాడు. నమ్మి అతడికి ఇవ్వగా ఒక్క రోజులో ఇస్తానని చెప్పి ఇవ్వకుండా రెండు రోజులు ఆటకాయించాడు. మూడో రోజున అకౌంట్ లోకి డబ్బు వచ్చిందని చూపించి ఎటిఎం దగ్గర డ్రా చేసుకొని వస్తానని చెప్పి తిరిగి రాలేదు.

చెట్టు విరిగి పడిన ఘటనలో బాలిక మృతి

ప్రజాశక్తి - సి బెళగల్



మృతి చెందిన శ్రీలేఖ (ఫైల్)

సిబెళగల్ మండలం పోలకల్ హైస్కూల్‌లో ఫిబ్రవరి28న చెట్టు విరిగి బాలికలపై పడటంతో ఇద్దరికీ స్వల్ప గాయాలు, ఒకరికి తీవ్ర రక్త గాయాలు అయిన సంఘటన పాటకులకు విధితమే. అయితే ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎనిమిద తరగతి విద్యార్థిని శ్రీలేఖ కోలుకోలేక కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మృతిచెందింది. ఈ బాలిక స్వగ్రామం గోనెగండ్ల మండలం పెద్ద నెలటూరు. తల్లిదండ్రులు శిరీషా, దస్తగిరి తరచూ వలస వెళ్తున్న కారణంగా తల్లి పుట్టిల్లు అయిన సి. బెళగల్ మండలం పోలకల్ గ్రామం మేనమామ ఇంట్లో ఉండి పోలకల్ హైస్కూల్‌లో చదివిస్తున్నారు. శుక్రవారం సైన్స్ డే సందర్భంగా పాఠశాల ఆవరణంలో చెట్ల కింద అక్కడి ఉపాధ్యాయులు ఎనిమిదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడే కాలం చెల్లిన చింత చెట్టు భారీ కొమ్మ ఈదురు గాలుల దాటికి విరిగి బాలికలపై పడింది. ఇందులో ఉమా, ఇందూలకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీ లేఖకు తీవ్రంగా గాయాలు కావడంతో ఇంచార్జి హెచ్ ఎం అయ్యస్వామి హుటా హుటినా అంబులెన్సు ద్వారా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం విద్యార్థి శ్రీలేఖ చనిపోయింది. శ్రీ లేఖకు ఒక చెల్లి ఒక తమ్ముడు ఉన్నారు. పెద్ద కూతురు శ్రీలేఖ విద్యలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాంక్షించిన తల్లిదండ్రులు, కుటుంబికులు, బంధువులు, తోటి విద్యార్థులు మరణవార్త విని శోకసంద్రంలో మునిగారు. సిబెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, విద్యాధికారి ఆడమ్ బాషా, హెచ్ ఎం రమాదేవి, జిల్లా ఉన్నత విద్యాధికారులు, మండల ప్రత్యేక అధికారి శ్యామల,గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితర నాయకులు, ఉపాధ్యాయులు పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

శ్రీలేఖ కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలి : ఎస్ఎఫ్ఐ

కర్నూలు హాస్పిటల్ : సి.బెళగల్ మండలం పోలకల్‌లో జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో చెట్టు విరిగి పడి గాయపడిన విద్యార్థిని శ్రీలేఖ మృతి చెందింది. సమాచారం రాగానే వెంటనే ప్రభుత్వ హాస్పిటల్ లో మార్చురి దగ్గరికి వెళ్లి విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా రంగప్ప మాట్లాడుతూ శ్రీలేఖ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాతబడిన భవనాలు, బలహీనమైన చెట్లను తొలగించి కొత్తవి నిర్మించాలని డిఇఒను కోరారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ పునరావతం కాకుండా జిల్లా మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అబుబకర్, సాయి ఉదయ్, పిఎస్ ఎన్ జిల్లా కన్వీనర్ అమర్ బాబు, నగర ఉపాధ్యక్షులు మల్లేష్, ఆర్యన్ నాయకులు ఆదిత్య పాల్గొన్నారు.

వేసవిలో వృద్ధులు చిన్న పిల్లలు జాగ్రత్త

- డాక్టర్ శంకర్‌శర్మ సూచనలు , సలహాలు
- వృద్ధులకు, చెప్పులు గొడుగులను పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఏడాది వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడిమికి గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూలు గాయత్రి ఎస్టేట్లోని శ్రీ గురుదత్త క్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో ఎండల వేడిమికి గురి కాకుండా వృద్ధులకు చెప్పులు, గొడుగులను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలల పాటు కొనసాగే వేసవికాలంలో ఎండ వేడికి గురి కాకుండా ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 11:00 లోపు సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రతి ఒక్కరూ తమ పనులను కొనసాగించాలన్నారు. మిగతా సమయంలో నీడ ప్రాంతాల్లో ఉండడం మంచిదని తెలిపారు. చెట్లు అందుబాటులో ఉండేవారు వాటి కింద ఉండటం వలన ఎండ వేడికి గురి కాకుండా ఉండవచ్చని చెప్పారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరు సాధ్యమైనంత ఎక్కువ నీరు తాగడం మంచిదని తెలిపారు. కలుషితమైన నీటిని కాకుండా స్వచ్ఛమైన నీటిని తాగేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవి ఎండల్లో తిరిగే వారికి వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, శరీరంలో నీరు ఇంకిపోవడం వల్ల డీహైడ్రేషన్‌కు గురి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. శరీరంలో నీరు ఇంకిపోవడం వల్ల మూత్రపిండాలకు రక్త సరఫరా తగ్గిపోయి మూత్రపిండాల వైఫల్యం సంభవించే అవకాశం ఉందన్నారు. కొన్ని సందర్భాలలో ఎండ వేడిమికి గురి కావడం వల్ల అపస్మారక స్థితికి చేరడం, రక్తపోటు పడిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. వేసవి ఎండలు ముఖ్యంగా ఇల్లు లేని, రేకుల షెడ్ లో నివసించే పేదలపై అధిక ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు.నేపథ్యంలో తన వంతు బాధ్యతగా ప్రజలకు అవసరమైన సూచనలు సలహాలు ఇస్తూనే పేద వృద్ధులకు చెప్పులు, గొడుగులను పంపిణీ చేసినట్లు డాక్టర్ శంకర శర్మ తెలిపారు.




వృద్ధులకు, చెప్పులు గొడుగులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కేంద్ర మంత్రి సోమన్నకు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో జరుగుతున్న గురు వైభవోత్సవాలకు రెండవ రోజు ముఖ్య అతిథులుగా సతీసమేతంగా హాజరయిన కేంద్ర రైల్వే, జలశక్తి శాఖా మంత్రి వి. సోమన్నకు పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం మంత్రాలయం చేరుకున్న ఆయనకు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పుష్ప గుచ్చం అందచేసి స్వాగతం పలికారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీ మఠం ఎఎఒ మాధవ శెట్టి, మాజీ ఒఎస్‌డి ఎస్కే శ్రీనివాసరావు మేనేజర్లు వెంకటేష్ జ్యోషి, సురేష్ కోనాపూర్ ,అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు జ్ఞాపకను అందజేసి అవార్డును ప్రదానం చేశారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం


కేంద్ర మంత్రికి రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం

ప్రస్తుతం వస్తున్న వందే భారత్‌కు ఎదురు పడే విధంగా మరో వందే భారత్ రైలును ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీ మఠం భక్తులుగా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

పెంచిన చలాన్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులపై పెంచిన చలానాను తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు 50 ఏళ్లకే సామాజిక పెన్షన్లు ఇవ్వాలి అన్నారు. కరోనా సమయంలో ఆటో కార్మికుల జీవన స్థితిలో ఎటువంటి మార్పు లేదని కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్‌టి వల్ల ఆటో ట్రాన్స్‌పోర్టు కార్మికుల జీవితాలు దౌర్భాగ్యంగా ఉన్నాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సభల్లో ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీలు ఇచ్చారని, వాహన మిత్రులకు మా ప్రభుత్వం వస్తే రూ.30 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. 2025-2026 బడ్జెట్లో ఆటో కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు కేటాయించకపోవడం చాలా అన్యాయమన్నారు. ఆటో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వివిధ రూపాల చలాన్ల భారం అధికమైందని


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బి రాముడు

ఆవేదన వ్యక్తపరిచారు. కొత్త చలానా విధానే విధానాన్ని ఆటో కార్మికులు వ్యతిరేకించాలని తెలిపారు. తక్షణమే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని, పిఎఫ్ , బీమా పథకం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో కార్మిక నాయకులు మోహన్ దాస్, షబ్బీర్, మధు, రంగన్న, ఖాజా, నరసింహులు, ప్రతాప్, రవికుమార్ గౌడ్, శేఖర్, రాజు, దస్తగిరి కార్మికులు పాల్గొన్నారు.

బాలికలు చదువులలో రాణించాలి

సిఐ అశోక్ కుమార్

ప్రజాశక్తి- కౌతాళం

నేటి పోటీ ప్రపంచంలో బాలికలు చదువులో రాణించి ఉన్నత స్థానం అందుకోవాలని సిఐ అశోక్ కుమార్ కోరారు. ఆదివారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 8న నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొనే సమస్యలు, వాటి నుండి ఎలా రక్షణ పొందాలో అవగాహన కల్పించారు. బాలికలు చదువుకున్నప్పుడే అన్ని రంగాలలో రాణిస్తారని తెలిపారు. సమాజంలో జరిగే ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వాలు ఎన్నో విద్య ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని అందుకోవాలంటే చదువులలో పోటీ పడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. చరిత్రలో ఉన్న వీర


మాట్లాడుతున్న సిఐ అశోక్ కుమార్

నారీమణులు ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, సంఘ సేవకులు మదర్ తెరిసా, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తదితరులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బందితోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-కోసిగి

మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీజగద్గురు గురు రాఘవేంద్రస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురు రాఘవేంద్రస్వామి సప్తవారోత్స వాల్లో భాగంగా ఉత్తరాధనను పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి వెంకటేశులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో ఉత్సవాలకు అంకురార్పణ పలికారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల పల్లకోత్సవం అనంతరం స్వామివారి పల్లకిని తుంగభద్ర నదివరకు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. జనవాహినిమధ్య రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం ముందుకు సాగింది. రథోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకోవడానికి అగసనూరు గ్రామంతో పాటు సాతనూరు, జూకూరు, మూగలదొడ్డి, కందుకూరు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పార్వతీపురంలో దోమలనివారణచర్యలు

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని పట్టణ శివారులోని పర్వతాపురం కాలనీలో దోమల నివారణ చర్యలు చేపట్టామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ తెలిపారు. ఆదివారం కాలనీల్లో మురుగు కాలువల్లో రసాయనిక ద్రావణాన్ని స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడారు. చెత్తాచెదారం నిలువ ఉంటే దోమల వృద్ధి చెందుతాయన్నారు. మురుగుకాలువల్లో, నిలిచిన నీటిలో ఎప్పటికప్పుడు రసాయనాలతో స్ప్రే చేయిస్తున్నామన్నారు. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారం వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయన్నారు. ప్రతి ఒక్కరు డస్ట్‌బిన్‌లు ఉపయోగించి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. ఇప్పటికే



క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించామని శానిటేషన్ మేస్త్రి రాజు తెలిపారు.

అంగన్‌వాడీ భవనాలు పూర్తయ్యేనా

-2017-18లో ప్రారంభం
- ప్రభుత్వం మారడంతో ఆగిపోయిన నిర్మాణాలు
- అప్పులు తెచ్చి పెట్టాం-వడ్డీలు కట్టలేకున్నాం

ప్రజాశక్తి-చిప్పగిరి

ఒక ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలను మరో ప్రభుత్వం వచ్చినప్పుడల్లా భవన నిర్మాణాలు ఆగిపోయి వాటికి పెట్టిన ఖర్చులు రాకపోగా తెచ్చిన అప్పులకు సంవత్సరాలు తరబడి వడ్డీలు చెల్లిస్తున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చిప్పగిరి మండలంలో 2017, 18 సంవత్సరంలో ఎంపిపి పాముల పద్మావతి ఉన్నప్పుడు నేమకల్లు, సంగాల, తిమ్మాపురం, బంటన హాల్, నంచర్ల ఈ ఐదు గ్రామాలలో అంగన్వాడి భవనాలు నిర్మించుటకు ప్రభుత్వం ఒక్కో అంగన్వాడి భవనానికి రూ.8 లక్షలు చొప్పున మంజూరు చేసింది. అంగన్వాడి భవన నిర్మాణలు చేపట్టేందుకు సంబంధిత కాంట్రాక్టు దారులు ముందుకు వచ్చిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అంగన్వాడి నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టు దారులు శరవేగంగా నిర్మాణాలు చేపట్టినప్పటికీ అనుకున్న ప్రకారం బిల్లులు అందక కొద్దిగా ఆలస్యమైన దాదాపు 70నుంచి 80 పూర్తి చేశారు. అయితే 2019లో సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ రావడంతో బిల్లలు ఆగిపోయాయి. 2019లో వైసిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ నిర్మాణ భవనాల పూర్తి చేయాలని ఆలోచన కానీ, సంబంధిత కాంట్రాక్టు దారులకు బిల్లులు అందివ్వాలని ఉన్నతాధికారులకు ప్రభుత్వంకు సమాచారం ఇవ్వాలని ఆలోచన కూడా రాకపోవడం రాలేదు. ఐదేళ్ల కాలంలో ఏనాడు కూడా వాటి వివరాలను ప్రస్తావించకపోవడం చాలా సోచనీయమని కాంట్రాక్టర్లు ఆవేదన చెందారు. మరల టిడిపి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులను పునరావతం కాకుండా


అసంపూర్తిగా ఆగిపోయిన అంగన్‌వాడీ భవనం

పెండింగులో ఉన్న మా బిల్లులను విడుదల చేస్తే ఆగిపోయిన ఈ నిర్మాణాలను 100శాతం పూర్తిచేసి త్వరితగతిన సంబంధిత ఐసిడిఎస్‌కు అప్పుచెపుతామని సంబంధిత కాంట్రాక్టర్లు ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలిపారు.

పెండింగు బిల్లులు ఇస్తే వెంటనే పూర్తి చేస్తాం

కాంట్రాక్టుదారుడు భాస్కర్, సంగాల అంగన్వాడి భవనం



2017 -18 లో అంగన్వాడి నిర్మాణ భవన నిర్మాణ పనులు మొదలు పెట్టాం. మొత్తం భవన నిర్మాణ విలువ రూ.8 లక్షలు ఉన్నప్పటికీ కేవలం ఇప్పటివరకు మాకు రూ.2 లక్షల 50 వేలు మాత్రమే మంజూరయ్యాయి. నిర్మాణం అయితే దాదాపు 90శాతం పూర్తి చేశాం. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగులో ఉన్న బిల్లులు చెల్లిస్తే పూర్తిచేసి భవనం ప్రభుత్వానికి అప్పగిస్తాం.

వలస విద్యార్థుల ఆశాకిరణం సీజనల్ హాస్టల్స్

- ఎంఇఒ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం రమేష్ నాయుడు

ప్రజాశక్తి - హాలహార్వి

వలస విద్యార్థులకు సీజనల్ హాస్టల్స్ ఆశాకిరణాలుగా నిలుస్తాయని మండల విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎరిగేర గ్రామం ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం హాలహర్వి మండల పరిధిలోని నిట్రవట్టి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సౌజన్యంతో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ మారుమూల గ్రామంలో సీజనల్ హాస్టల్ వలస విద్యార్థులకు ఆశ కిరణాలుగా నిలిచాయన్నారు. ఇక్కడ 50 మంది విద్యార్థులకు వసతితో పాటు భోజన సౌకర్యం సమృద్ధిగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. హాజరు పట్టికలో ఉన్న విద్యార్థుల పేర్లను చదివారు. 50 మంది ఉండవలసిన సెంటర్లో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనంగా మరో 13 మందికి వసతితో పాటు భోజన సౌకర్యం కల్పించడం హర్షించదగ్గ విషయం అన్నారు. మొత్తం 63 వసతి కల్పించారన్నారు. విద్యార్థులను స్వయంగా పిలుచుకొని అల్పాహారంతో పాటు భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడగగా విద్యార్థులు రుచికరమైన నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఏ ఏ ప్రాంతాలకు వలసలు వెళ్లారని అడగగా గుంటూరు,



బెంగళూరు,హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు విద్యార్థులు తెలిపారన్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు చక్కగా ఉన్నాయని, మీరు బాగా చదివి మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు, ఉపాధ్యాయుల అయ్యన్నగౌడ్, కేర్ టేకర్ లక్ష్మన్న, వంట మనిషి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చదువు, ఆట, పాటలకు నెలవు జీనియస్ గ్లోబల్ స్కూల్

ప్రజాశక్తి-మంత్రాలయం

విద్యార్థిని విద్యార్థులకు కేవలం చదువు విషయంలోనే కాదు ఆట పాటలకు నెలవుగా విరాజిల్లుతుంది. శనివారం స్థానిక శ్రీ వైష్ణవి ఇంగ్లీష మీడియం పాఠశాల ఆవరణంలో జీనియస్ గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ గంగాధర రెడ్డి ప్రిన్సిపల్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిటిడి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి, వైసిపి మండల ఇన్చార్జి విశ్వనాథ్ రెడ్డి లు హాజరుకాగా ఆయనకు ఘనంగా స్వాగతం



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు

పలికారు. అతిథులను శాలువతో పూల మాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు డిజె సౌండ్ మధ్య డ్యాన్స్ లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చిన్నారుల తల్లిదండ్రులను సందర్శకులను ఆకట్టుకున్నాయి. జీనియస్ గ్లోబల్ స్కూల్ స్థాపించిన అనతి కాలంలోనే విద్యలోనూ ఆట పాటలలోనూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటూ మండల ప్రజల మన్ననలు పొందుతున్నారు.

శ్రీలేఖ కుటుంబానికి రూ.15 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : శ్రీలేఖ కుటుంబానికి రూ15లక్షలు ఇవ్వాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి. రంగస్వామి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సి .బెలగల్ మండలం పోలకల్ గ్రామంలో ఉన్న జడ్‌పిహెచ్ఎస్ స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీలేఖ శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్‌లో చెట్టు విరిగిపడిన ఘటనలో గాయపడిందన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయింది. బాలిక కుటుంబానికి ప్రభుత్వం విద్యాశాఖ స్పందించి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గాయపడిన విద్యార్థులకు రూ.4లక్షలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులందరిని సమీకరించి పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామనిని హెచ్చరించారు.

వాల్మీకి ఎస్‌టి బిల్లు పై మంత్రి లోకేష్ సానుకూలత

ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్రఅధ్యక్షులు బి లక్ష్మన్న

ప్రజాశక్తి-మంత్రాలయం



వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తించే బిల్లు ఆమోదంపై రాష్ట్ర విద్యా, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బి లక్ష్మన్న తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు సమాచారం అందించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై శనివారం మంత్రాలయం వచ్చిన ఆయనకు వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించి బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపాలని వినతిపత్రం అందజేయగా గతంలోనే కేంద్రానికి పంపామని, పార్లమెంటులో కూడా ఆమోదం పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో కలిసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఉన్న సత్సంబంధాల కారణంగా వాల్మీకుల ఎస్టీ బిల్లు ఆమోదం లభిస్తే గత 40 ఏళ్లుగా చేస్తూ ఎదురు చూస్తున్న కల నెరవేరుతుందన్నారు. విద్య ఉపాధి ఆర్థిక రాజకీయ రంగాల్లో అంత్యంత వెనుకబడిన వాల్మీకుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, అలా జరిగితే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి, లోకేష్ బాబుకు రుణ పడి ఉంటామని తెలిపారు.

నేటి నుంచి శ్రీ భూనీళా చెంచులక్ష్మి ఓబులేశ్వర స్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-ఆస్పరి

మండల పరిధిలోని తొగలగల్లు గ్రామంలో వెలసిన శ్రీ భూనీళా చెంచులక్ష్మి ఓబులేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని గ్రామస్తులు లక్ష్మన్న తెలిపారు. గ్రామ దేవతలకు అభిషేకాలు, కలశ సేవ పూజా కార్యక్రమాలు ఉంటాయి. రాత్రి పల్లకి సేవ జరుగుతుంది. మంగళవారం స్వామి వార్లకు ఉదయం 10 నుండి 11 గంటల వరకు కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్వామివారి రథోత్సవంఅనంతరం బుక్కిపిండి సేవ,నుగ్గులాట, వసంతోత్సవం చక్రస్నానం జరుగుతుందన్నారు. స్వామి వారి కొండకు మెట్లు ఏర్పాటు చేసిన దాతలకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు.

ఖేలో ఇండియా ఉషు పోటీల్లో కెవిఆర్ కాలేజీకి పతకాలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా సీనియర్స్ రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో కెవిఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఏడు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల ఆవరణలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వివిఎస్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు ఉషు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ఆత్మ రక్షణ కొరకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం పతకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల చరిత్ర అధ్యాపకురాలు ఎ.జయలక్ష్మి పతకాలు సాధించిన వారిని అభినందించారు. బంగారు పతకం దేవి, శ్రావణి, జయలలిత. వెండి పతకం చిన్న గర్జమ్మ, రాధిక, నసీమ రాగి పతకం నందిని సాధించారని జిల్లా ఉషు సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు తెలిపారు.

చలో విజయవాడకు ఆశాలు తరలి రావాలి

ప్రజాశక్తి-ఆదోని

ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ చలో విజయవాడ నిర్వహిస్తామని భారీగా తరలి రావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు కోరారు. ఆదివారం ఆదోని రెవెన్యూ భవన్లో ఆశా వర్కర్ల జిల్లా విస్తృత సమావేశం శివలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి పిఎస్ గోపాల్, మండల అధ్యక్ష కార్యదర్శులు వీరారెడ్డి రామాంజనేయులు హాజరయ్యారు. అంజిబాబు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతున్నామని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో నిర్వహించే రాష్ట్ర మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. 2024 సంవత్సరం రాష్ట్రకమిటీ నాయకత్వంతో అధికారులు జరిపిన చర్చల్లో చేసుకున్న ఒప్పందాలను సంవత్సరమవుతున్నా ఆశ వర్కర్లకు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కంటే ఆశ వర్కర్లకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేలు చేస్తామని ప్రస్తుత పాలకులు చెప్పిన కార్యరూపం దాల్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు కావస్తున్న ఆశ వర్కర్లకు కనీస వేతనం నెలకి రూ .26 వేలు ఇవ్వకుండా ఆశ వర్కర్లతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అంజిబాబు

చేయించుకుంటుందన్నారు. 2024- 25 సంవత్సరంలో రాష్ట్ర బడ్జెట్లో స్కీం వర్కర్లకు ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. స్కీం వర్కర్ల అందరికీ ఆశ, అంగనవాడి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సామాజిక భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అనేక వినతి పత్రాలు ఇచ్చినా అమలు చేస్తామని కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఈనెల6న చలో విజయవాడ ఆందోళన కార్యక్రమానికి ఆశా వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాలొనాలన్నారు. ఆశ వర్కర్లు జయలక్ష్మి, రాజేశ్వరి, సుహాసిని, లావణ్య, నాగవేణి, సుకన్య ,శాంతమ్మ ,సుజాత, వున్నారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళపై జరుగుతున్న, దాడులు దౌర్జన్యాలపై పోర్పాటం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు పిలుపునిచ్చారు. ఆదివారం వీకర్‌సెక్షన్ కాలనీలో శ్యామల అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం దినోత్సవ ముందస్తు సమావేశంలో ఎన్.అలివేలు మాట్లాడారు. మహిళల హక్కుల కోసం, పాలకులు ఇస్తున్న హామీల కోసం, నేడు సమాజంలో వివిధ రూపాల్లో దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలను అదుపు చేయాలనే పోరాటాలు చేయక తప్పదని సూచించారు. సమాజంలో మహిళ ప్రాధాన్యతను వివరిస్తూ నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించే



కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో మహిళలు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో మహిళా సంఘం నాయకులు అనసూయ, లత మహిళా జర్నలిస్టు సుజాత, వీకర్ సెక్షన్ కాలనీ ఐక్య సంఘాల ఓబీలు, ఆర్పీలు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత అలవాటు చేయాలి

ప్రజాశక్తి ఆదోని : విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత అలవాటు చేసి బాధ్యత యుతమైన వారిగా తీర్చిదిద్దాలని ఆదోని డిఎస్‌పి హేమలత సూచించారు. ఆదోని పట్టణంలోని భాష్యంలో అకాడమిక్ ఇయర్ కల్చరల్ ప్రోగ్రామ్ ప్రిన్సిపల్ సురేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు .డిఎస్‌పి హేమలత మాట్లాడుతూ మైనర్ లు బైక్ నడపడం చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరూ



ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వివరించారు విలువలతో కూడిన విద్యను అందించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సురేంద్రబాబు మాట్లాడుతూభాష్యం విద్యా సంస్థలు చదువుతోపాటు శారీరకంగా మానసికంగా అభివృద్ధి కొరకు అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరాటే యోగ మార్షల్ ఆర్ట్స్ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు అకాడమిక్ టాపర్స్, అటెండెన్స్ టాపర్స్ లను సన్మానించామని హెచ్‌ఎం శిరీష వివరించారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

ప్రజాశక్తి -హోలగుంద

మండల పరిధిలో నేరానికి , కొత్తపేట తండ కొండ గుహలో వెలిసినశ్రీ మాల మల్లేశ్వర దేవరగట్టు సన్నిధిలో ఆదివారం సందర్భంగా భక్తులు, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి భక్తులు ప్రత్యేక పూజల కోసం గిరి పైకి క్యూ కట్టారు. శ్రీ మాల మల్లేశ్వర స్వామి వారికి అభిషేకం, బిల్వార్చన, బండ అర్చన, అమ్మవారికి కుంకుమార్చన ఆకు పూజలు తదితర పూజ కార్యక్రమాలలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు పంపన్న స్వామి మహేష్ స్వామీలు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. మరి కొంతమంది భక్తులు కింద నుండి పై గిరి వరకు ప్రతి మెట్టుకు కుంకుమ బండారు అంటిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. వచ్చిన భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం చేశారు.


దేవరగట్టులో పూజలు

ఆగవేళిలో పెద్ద దేవర మహోత్సవం

ప్రజాశక్తి- క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండల పరిధిలో ఆగవేలి గ్రామం లో వెలసిన శ్రీ శ్రీ పెద్దమ్మ, సుంకులమ్మ మారెమ్మ, కర్రెమ్మ రాములమ్మ దేవతల పెద్ద దేవర వేడుకల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఈ నెల 4న మంగళవారం సుంకులమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, కర్రెమ్మ రాములమ్మ దేవతలకు 7 గంటలకు పూజ, నైవేద్య సమర్పిత కార్యక్రమం ఉంటుందన్నారు.

IN THE COURT OF HON'BLE PROHIBITION & EXCISE COURT AT KURNOOL
O.S. NO: 135/2023

మెస్టిక్ రమేశ్. ...వాది

Vs

వి.నాగేశ్వరా రావు. ...ప్రతివాది

ప్రతివాది కి దావా సమ్మాన్లు

వి. నాగేశ్వర రావు S/o రామ స్వామి
వయస్సు 50 సం॥, వృత్తి: వ్యాపారస్తుడు,
R/o: H: No:120, ముజఫ్ఫర్ నగర్,
కల్లూరు (మండల్), కర్నూల్ (డిస్ట్రిక్ట్).

పై నెంబర్ దావాలో వాది, ప్రతి వాది నుండి దావా మొత్తము Rs:2,00,000/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసి నారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 19/03/2025 వ తేదీ ఉదయం 10:30 గం. ల కు పై కోర్టు లో మీరు కాని మీ తరపు న్యాయవాది కాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమునా విచారించి తీర్మానించబడనని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

S.Iqbal Basha,
వాడి పరం న్యాయవాది, కర్నూల్.
Cell : 94405 29820

మహారాజ శ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S NO. 20/ 2022

యన్.రాజరత్నం. ...వాది

-Vs-

పేరుమల్ల వెంకటేశ్వర్లు. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్సు

పేరుమల్ల వెంకటేశ్వర్లు తండ్రి పి.క్రిష్ణుడు,
స్కూలు అసిస్టెంట్, ఇంటి నెం. 5-1-14-3,
మమతానగర్, కల్లూరు ఎస్టేట్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 1,50,000/- లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 19-03-2025 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

S.Iqbal Basha,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.